క్రైం కార్నర్..

భర్తతో గొడవ పడి వెళ్లిపోయిన భార్య

భర్త ఫిర్యాదుతో కేసు నమోదు



రేఖారాణి (ఫైల్)

బాలానగర్: భర్తతో గొడవ పడి ఓ గృహిణి తన కూతురితో కలసి ఇల్లు వదలి వెళ్లిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సిఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం శేఖర్, రేఖారాణి దంపతులు ఫిరోజ్‌గూడలో నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఆదివారం సుమారు 1.30గంటల సమయంలో రేఖారాణి (33)తన కూతురు ఐశ్వర్య(8)తో కలిసి ఇల్లు వదిలి వెళ్లిపోయింది. షాపుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన శేఖర్ బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

జీడిమెట్ల: ఓ వ్యభిచార గృహంపై జీడిమెట్ల పోలీసలు దాడి చేసి ఇద్దరు నిర్వాహకులతో పాటు ఓ మహిళ, ఓ యువకుడిని అరెస్టు చేశారు. సీఐ యం.పవన్ వివరాల ప్రకారం.. ఆదివారం గాజులరామారంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కన్నెపల్లి శోభ(47), మందుల లత(35) అనే ఇద్దరు నిర్వాహకులతో పాటు ఓ మహిళ(23), గుండ్లపోచంపల్లికి చెందిన సందీప్ కుమార్ జేనా(27)లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అందరిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మహిళను రెస్క్యూహోంకు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

జగద్గిరిగుట్ట: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట మైసమ్మనగర్‌కు చెందిన బద్దం వెంకటరెడ్డి(45), మంజుల భార్యాభర్తలు. కాగా మే 17న ఉదయం 8 గంటలకు భార్యను డ్యూటీ నిమిత్తం జగద్గిరిగుట్ట బస్టాప్‌లో బైక్‌పై దించిన వెంకటరెడ్డి 8.30 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని తన కుమారుడికి చెప్పి వెళ్లాడు. అయితే అదే రోజు రాత్రి 8 గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన మంజుల కు భర్త టిఫిన్ బాక్స్, మొబైల్ ఫోన్‌లు ఇంటి వద్దనే ఉంచాడని గమనించి అతని కోసం కంపెనీకి కాల్ చేస్తే డ్యూటీకి రాలేదని చెప్పారు. దీంతో అప్పటి నుండి కుటుంబ సభ్యులు వెంకటరెడ్డి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేయగా ఎటువంటి సమాచారం తెలియకపోవడంతో ఆదివారం జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అండగా..

నిజాంపేట్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు దాసి నాగరాజు అండగా నిలిచారు. బాచుపల్లిలో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని కూలి పనులు చేసే వెంకటేష్ ఈనెల 28న మణికొండలోని పనులు ముగించుకుని నడచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. అతని ఎడమ కాలిపాదానికి తీవ్ర గాయమైంది. దీంతో అతనికి రూ.10వేలు వెచ్చించి ప్రాథమిక చికిత్స అందించారు. సమాచారం అందుకున్న దాసి నాగరాజు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన గుడిమల్కాపూర్‌కు చెందిన మహ్మద్ హర్షద్‌తో మాట్లాడి రూ.60 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం ఇచ్చేలా ఒప్పించి సదరు మొత్తాన్ని ఆదివారం బాధితుడు వెంకటేష్‌కు అందజేశారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు, ఇతర కూలిలు హర్షం వ్యక్తం చేశారు.

మింగే మ్యాన్‌హోళ్లు!

నిర్లక్ష్యపు అధికారులు

ప్రమాదం చెప్పి రాదు.. అధికారులకు చెప్పినా స్పందించరు

కాలనీ, బస్తీల్లో నోళ్లు తెరిచిన మ్యాన్‌హోళ్లు

- పలు ప్రాంతాల్లో మూతలు ధ్వంసం
- మూతలు కాకుండా పెద్ద బండరాళ్లతో కప్పేసిన వైనం
- ఇంకొన్ని కాలనీల్లో ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు
- పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టని అధికారులు
- మ్యాన్‌హోల్ ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలకు పూనుకోని వాటర్ వర్క్స్



పీఎన్ఆర్ హైట్స్ సమీపంలో పొంగి పొర్లుతున్న మ్యాన్‌హల్



శుభోదయా కాలనీలో ఏడాది కాలంగా మరమ్మత్తులకు నోచుకోని మ్యాన్‌హోల్



అడ్డగుట్ట సొసైటీలో మ్యాన్‌హోల్ వద్ద ప్రమాదసూచిక బోర్డు



భాగ్యనగర్ కాలనీ సిరి హోటల్ సమీపంలో..

భాగ్యనగర్‌కాలనీ: వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మ్యాన్‌హోళ్ల నోర్లు తెరిచి ప్రమాదకరంగా మారాయి. కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా మ్యాన్‌హోళ్ల మూతలను నిర్మించటంతో అవి మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు ఏర్పాటు చేశారు. అయినా హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మూతలు ధ్వంసమై.. మూతలు లేకుండా మ్యాన్‌హోళ్లు కనిపించడం గమనార్హం.

◆ వేసవిలో అనుకోని పరిస్థితుల్లో భారీ వర్షాలు కురుస్తే మ్యాన్‌హోళ్ల పొంగిపొర్లి మూతలు కొట్టుకుపోవటమే కాకుండా ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. శుభోదయ కాలనీలో గతేడాది కాలంగా మ్యాన్‌హోళ్లపై పెద్ద బండ రాళ్లను ఏర్పాటు చేసి మ్యాన్‌హోళ్లకు అడ్డుగా ప్రమాదసూచిక బోర్డును ఏర్పాటు చేశారు. దాదాపు ఏడాది గడిచినప్పటికీ ఆ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టకుండా వదిలివేయటంతో నిత్యం వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

◆ అదే విధంగా అడ్డగుట్ట సొసైటీలోని ప్లాట్ నం .172సీ ఎదురుగా ఇటీవల మ్యాన్‌హోళ్లపై కప్పు ధ్వంసం కావటంతో ప్రమాదకరమైన బోర్డును ఏర్పాటు చేశారే తప్ప ఎటువంటి మరమ్మతు చేయలేదు. వర్షపు నీటి తాకిడికి ఆ బోర్డు కూడా పడిపోతే ఆ రోడ్డు వెంబడి సాగించే వారికి మ్యాన్‌హోల్‌లో పడిపోయే అవకాశం ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

◆ భాగ్యనగర్ కాలనీలోని సిరి హోటల్ సమీపంలో మ్యాన్‌హోల్ పైకప్పు ధ్వంసం కావటంతో ఇనుప చువ్వలు పైకి తేలి ప్రమాదకరంగా మారాయి. కళామందిర్ ప్రాంతంలో రెండు రోజులుగా మ్యాన్‌హోల్ పొంగిపొర్లి డ్రైనేజీ మురుగు జాతీయ రహదారిపై పారుతూ దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసన భరించలేక స్థానికులు వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేయటంతో శనివారం నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు.

◆ మ్యాన్‌హోళ్లతో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదం చోటు చేసుకుంటున్నా ఇక్కడి అధికారులకు మాత్రం ఎలాంటి చలనం లేకుండా పోతోంది. అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికారులు అలసత్వం వీడి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మ్యాన్‌హోళ్లతో ప్రమాదం జరగక ముందే ఆ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆరు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై

నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రవాస భారతీయుడు సత్యనారాయణరెడ్డి

కూకట్‌పల్లి: ఆరు దశాబ్దాల తరువాత అపూర్వ సమ్మేళనంలో ఒకటైన పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1952 నుంచి 1962 వరకు విద్యార్థి దశను పూర్తి చేసుకున్న పలువురు హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధాలో ఒకే వేదికపై ఆదివారం కలిశారు. విద్యార్థి దశలో ఆటపాటలతో కలుసుకున్న ఈ స్నేహితులు ఉద్యోగ విరమణ చేసి 20 సంవత్సరాల గడిచిన తరువాత వీరంతా ఒకే వేదికపై కలిశారు.

◆ హైదరాబాద్ ఉస్మానియాలో డాక్టర్‌గా పనిచేసిన ప్రభాకరాచారి, ప్రవాస భారతీయుడు సత్యనారాయణరెడ్డి, యాదగిరిరెడ్డి, కనకమల్లు, తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఏర్పడి సుమారు 72 సంవత్సరాలు పూర్తి కావటం మరో మూడు సంవత్సరాల్లో వజ్రోత్సవాలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ వేడుకలను కూడా భారీ ఎత్తున నిర్వహించేందుకు ఇప్పటినుంచే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

◆ ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కోసం పని చేసిన పలువురిని అభినందించారు. పాఠశాల నుంచి ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు చురకంటి పవన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డిలను ముఖ్యఅతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందాల దామోదర్‌రెడ్డి, తీగల కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



భక్తులకు మజ్జిగ అందజేస్తున్న కార్పొరేటర్

బాలానగర్‌లోని శోభనా బస్‌స్టాప్ వద్ద ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో ఆరాధన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తుకు మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో భిక్షపతిచారి, లక్ష్మీ, సుజాత, బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు. – బాలానగర్

ప్రజా సమస్యలు తెలుసుకుంటూ గడపగడపకు బీజేపీ



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణ నగర్, దీనబంధుకాలనీల్లో ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏళ్ల తరబడి మూలుగుతున్న సమస్యలకు పరిష్కారం లభించలేదన్నారు. ప్రజా సమస్యలకు బీజేపీ భరోసాగా మారాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను ఇంటికి సాగనంపుతారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ గడపగడపకు బీజేపీ అనే కార్యక్రమంలో ప్రజల గుండెచప్పుడు వింటూ వారి బాధలను తెలుసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింగరావు, కల్పన ఏకాంత్‌గౌడ్, రేపాన్ రాజు శ్రీహరియాదవ్ గోపాల్ రావు, భూపాల్‌రెడ్డి, తిమ్మయ్య, లక్ష్మణ్, ముత్యాలు, గణేష్‌గౌడ్, అశోక్, జితేందర్, శాలిని, కళ్యాణ్, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్ పరిధిలోని సాయినగర్ వెస్ట్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, తులసీనగర్, పాపమ్మ బస్తీ, మహంకాళినగర్, పీవీఆర్ సాయిహిల్స్ కాలనీల్లో రూ.1.35 కోట్లతో సీసీరోడ్డు పనులు చేపడుతున్నారు. ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రతి కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. ప్రభుత్వం అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ మార్గదర్శకంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. అదే విధంగా మౌలిక వసతులు ఏర్పాటుకు పెద్దపీట వేస్తామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమానాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడొద్దన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాజేష్ చంద్ర, కాశీనాద్ యాదవ్, జిల్లా గణేష్, శివ రాజ్‌గౌడ్, జి. ప్రభాకర్, వెంకటేష్‌గౌడ్, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి..

భాగ్యనగర్‌కాలనీ: మండు వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం హెచ్‌ఎంటీ శాతవాహననగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ కేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. నగరంలో ఎండలు రోజు రోజుకు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన వాకర్స్ సభ్యులను ఆయన అభినందించారు. వాహనదారులు, పాదచారులు ఈ చలివేంద్రాలని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు జీవన్‌జ్యోతి స్కూల్‌లో కంటి వెలుగు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్‌ఆల్విన్‌కాలనీ తులసీనగర్ జీవన్‌జ్యోతి హైస్కూలులో సోమవారం ఉదయం 9గంటల నుంచి కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిపుణులైన వైద్య బృందం కంటి పరీక్షలు చేస్తారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

అక్రమ సంబంధాన్ని బయటపెట్టినందుకు..

భార్య బంధువులపై కత్తితో దాడి

జీడిమెట్ల: వేరే మహిళతో అక్రమ సంబంధాన్ని బయటపెట్టిన భార్య బంధువులపై భర్త కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం వల్లభాయ్‌నగర్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు మెదక్ జిల్లా చేగుంట మండలం నార్సింగికి చెందిన స్వప్నతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కాగా విజయ్‌కుమార్ మూడేళ్లుగా మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తూ వస్తున్నాడు. అప్పటి నుంచి భార్యను సైతం దూరం పెడుతూ విడాకులు ఇవ్వాల్సిందిగా వేధిస్తూ వస్తున్నాడు. కొన్ని నెలలుగా ఇంటి రావడం లేదు, కుటుంబ సభ్యులు ఫోన్లు చేసినా స్పందించడం లేదు.

◆ శనివారం రాత్రి సదరు మహిళతో విజయ్‌కుమార్ ఉన్నట్లు తెలుసుకున్న స్వప్న, ఆమె అక్కలు శ్యామల, మంజుల, బాబాయి శ్రీనివాస్ అక్కడికి వెళ్లారు. అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నిలదీయగా వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య స్వప్నను కొడుతున్న విజయ్‌కుమార్‌ను అడ్డుకున్న శ్రీనివాస్‌పై కత్తితో దాడి చేయగా అతని మెడభాగం, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం బాధిత మహిళ స్వప్న జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మన్ కీ బాత్ @ 100

- ప్రధాని మోదీ సందేశాన్ని విన్న నియోజకవర్గ ప్రజలు
- సమాజ హితానికి పాటుపడున్న వారిని దేశ ప్రజలకు పరిచయం చేశారు: మాధవరం కాంతారావు
- నిస్వార్థంగా సేవలు చేస్తున్న ఎంతో మందికి గుర్తింపు వచ్చిందని వ్యాఖ్య

మోతీనగర్: భారత ప్రధాని మోడీ మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌పై యావత్ ప్రపంచం ఆసక్తి చూపిస్తోందని కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని శక్తి కేంద్రం ఇన్‌చార్జి అమ్రేష్ రాజు ఆధ్వర్యంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాధవరం కాంతారావు మాట్లాడుతూ కేంద్రమంత్రులు, బీజేపీ ఇతర ముఖ్య నేతలు కార్యకర్తలతో కలిసి ప్రధాన్ని ప్రసంగాన్ని విన్నారని తెలిపారు. ప్రధాని దీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను దేశం మొత్తం వినడం గొప్ప విషయమన్నారు. భారతదేశ నలుమూలల్లో ఉన్నటువంటి మహనీయ వ్యక్తుల సేవలను గుర్తించడంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని 100 నెలలు ఏకధాటిగా కొనసాగించటమనేది ప్రధాని దక్షత, క్రమశిక్షణకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమం ఐక్యరాజ్యసమితి హెడ్‌క్వార్టర్స్‌లో లైవ్ టెలికాస్ట్ జరిగిందన్నారు. మన్ కీ బాత్ అన్‌సంగ్ హీరోలను దేశ ప్రజలకు పరిచయం చేయడంలో ముఖ్య పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు అమ్రేష్ రాజు, గురు బచ్చన్, ఉదయ్‌రాజు, రవి, రాజేష్, దేవిదిన్, విజయ, నాగరాజు, శాంబశివ, దేవేందర్, సంతోష్, రాకేష్, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ డివిజన్ దీనబంధుకాలనీ చౌరస్తాలో..

ఆల్విన్‌కాలనీ: ప్రధాని మోదీ 100వ ఎపిసోడ్ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వివేకానందనగర్ డివిజన్ దీనబంధుకాలనీ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్‌తో కలసి స్థానికులు ఆదివారం వీక్షించారు. స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా, లోకల్ ఫర్ లోకల్ కార్యక్రమం ద్వారా చెక్క బొమ్మల తయారీ వంటి పరిశ్రమలను నెలకొల్పిన వారిని స్వయంగా దేశ ప్రధానే ప్రోత్సహించటం అభినందనీయమని ఆయన అన్నారు. జాతి నిర్మాణంలో ప్రజలందరూ పాలుపంచుకునే విధంగా ప్రధాని కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కంటెస్టెంట్ కార్పొరేటర్ విద్యాలక్ష్మన, శ్రీహరి యాదవ్, ఏకాంత్ గౌడ్, రేపాన్ రాజు, గోపాల్‌రావు, గణేష్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



దీనబంధు కాలనీ చౌరస్తాలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న స్థానికులు

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో..

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రధాని మోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ పూర్తి చేసుకున్న తరుణంలో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో బీజేవైఎం నాయకులు పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నె ప్రకాశ్, మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎనుగుల తిరుపతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని తిలకించారు. మన్ కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ ఎవరికీ తెలియని వారిని దేశప్రజలకు పరిచయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చింటు వర్మ, అజయ్, దేవేందర్‌గౌడ్, జయ, రాకేష్, వెంకట్ పాల్గొన్నారు.



కార్యక్రమం అనంతరం మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేవైఎం కార్యవర్గ సభ్యులు ప్రకాశ్, నేతలు